# బస్సుల కోసం పడిగాపులు



మూసాపేట నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు కోసం క్యూ కట్టిన విద్యార్థులు, ప్రయాణికులు

- ఉదయం వేళ తప్పని తిప్పలు
- రెండు బస్సులే దిక్కు
- కిక్కిరిసిపోతున్న వైనం
- షటిల్ సర్వీస్ నడపాలంటున్న ప్రయాణికులు

**అడ్డాకుల:** మూసాపేట మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు ఉదయం వేళ బస్సుల కోసం ప్రయాణికులు, కళాశాల, పాఠశాలల విద్యార్థులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సరైన సమయంలో బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసాపేటతో పాటు నిజాలాపూర్, మహ్మదుస్సేన్‌పల్లి, వేముల, సంకలమద్ది, జానంపేట, కొమిరెడ్డిపల్లి, పొన్నకల్, నందిపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సుల కోసం అవస్థలు పడుతున్నారు. రాచాల నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు మూసాపేటకు తెల్లవారుజామున 5.30గంటలకు వస్తుంది. వనపర్తి నుంచి కందూర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు మూసాపేటకు ఉదయం 7.45నుంచి 8గంటల లోపు, కొత్తకోట నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు ఉదయం 9గంటలకు మూసాపేటకు వస్తుంది. ఈమధ్యలో బస్సులు లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పడుతున్న ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల లోపు మూడే బస్సులు రావడం.. అందులో ఒకటి తెల్లవారుజామునే వెళ్తుంది. కేవలం రెండు బస్సుల్లోనే ప్రయాణికులు, కళాశాల, పాఠశాలల విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. విద్యార్థులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

**వేముల బస్సును రద్దు చేయడంతోనే..**

గతంలో వేముల నుంచి ఉదయం 6గంటలకు మహబూబ్‌నగర్ వెళ్లే బస్సు వచ్చేది.నాలుగేళ్ల క్రితం వేముల బస్సును రద్దు చేశారు. దీంతో సమస్య ఏర్పడింది. ఉదయం 9గంటల లోపు వచ్చే రెండు బస్సులు రద్దయిన రోజూ విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్లే పరిస్థితి. మహబూబ్‌నగర్ డిపో ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం వేళ మూసాపేటకు షటిల్ సర్వీసును నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆటోలో కాలేజీకి వెళ్తున్నా



మూసాపేట నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు ఉదయం 9గంటల లోపు కేవలం రెండే బస్సులే ఉన్నాయి. ఇందులో ఏరోజైనా ఒక్క బస్సు రాలేదంటే ఆరోజు ఆటోలో కాలేజీకి వెళ్తున్నాం. మహబూబ్‌నగర్ వెళ్లే బస్సుల కోసం రోజూ ఇబ్బందులు తప్పడం లేదు.

– శంకర్, ఇంటర్ విద్యార్థి, నిజాలాపూర్

### ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళ్తున్నాం..



ఉదయం మూసాపేట నుంచి కళాశాలకు వెళ్లడానికి రెండే బస్సులు ఉన్నాయి. అవి ముందే నిండుగా రావడంతో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళ్తున్నాం. రోజూ ఇదే పరిస్థితి ఉంది. ఉదయం వేళ మూసాపేట నుంచి మహబూబ్‌నగర్‌కు షటిల్ బస్ నడపాలి.

–గౌస్‌పాష, ఇంటర్ విద్యార్థి, మూసాపేట

## క్లుప్తంగా

### 25న అయ్యప్ప కొండపై మహా పడిపూజ



**స్టేషన్ మహబూబ్‌నగర్:** స్థానిక అయ్యప్ప కొండపై ఈ నెల 25న శ్రీఅయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు భగవంతురావు తెలిపారు. ఆదివారం అయ్యప్పకొండపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 5గంటల నుంచి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సాయంత్రం 7.30గంటలకు గురుస్వాముల ఆధ్వర్యంలో పదునెట్టాంబడి పూజ, మహా మంగళహారతి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈపూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం మహా పడిపూజ కరపత్రాలను ఆవిష్కరించారు. సేవా సమాజం ప్రధాన కార్యదర్శి ముత్యం గురుస్వామి, పంబరాజు, మాల్యాద్రిరెడ్డి, కేశవులు, ప్రమోద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### మైసమ్మ చెంత భక్తుల రద్దీ



**నవాబుపేట:** మండలంలోని మైసమ్మ దేవాలయం చెంత భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు మైసమ్మ దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో అడవి ప్రాంతం కోలాహలంగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణలో భక్తులు సేదతీరారు.

### వ్యవసాయ శాస్త్రవేత్తకి ఘన సన్మానం



**స్టేషన్ మహబూబ్‌నగర్:** భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తగా ఎంపికైన జిల్లావాసి డాక్టర్ కొత్తూరు గ్రీష్మరెడ్డిని పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం బీకేరెడ్డికాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తూము ఇంద్రసేనారెడ్డి, వేపూరు రాజేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్.సురేందర్‌రెడ్డి, గ్రీష్మ తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

### సదాశివయ్యకు కిసాన్ సేవారత్న అవార్డు



**జడ్చర్ల టౌన్:** పట్టణంలోని బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్యకు కిసాన్ సేవారత్న 2023 అవార్డు దక్కింది. ఆదివారం యాదగిరిగుట్ట రెడ్ల సంక్షేమ సంఘం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డును స్వీకరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ప్రతిష్టాన్ సంస్థ నిర్వహించిన గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు–24లో ఆయనకు అవార్డును సంస్థ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అందించారు. వృక్షశాస్త్రంలో చేసిన సేవలతోపాటు సేంద్రియ పద్ధతిలో గార్డెన్ పెంచినందుకు అవార్డును అందజేశారు. సదాశివయ్యకు అవార్డు రావటంపై ప్రిన్సిపాల్ డా.సుకన్య, అధ్యాపకబృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

### సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మృతి

**నవాబుపేట:** అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాజీ కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఖాజామైనోద్దిన్(84) ఆదివారం మృతిచెందాడు. రెవెన్యూ శాఖలో ఆర్ఐగా ఉద్యోగం చేసి పదవి విరమణ చేశాక తెలంగాణ మలిదశ ఉద్యమంలో ముందుకు సాగారు. ఆఉద్యమంలో లక్ష్మారెడ్డికి ముఖ్య సహచరుడిగా ఉన్నారు. 2021లో టీఆర్ఎస్ ద్వారా కోఆప్షన్ సభ్యుడిగా బాధ్య తలు నిర్వర్తించారు. ఖాజామైనోద్దిన్ మృతిపట్ల మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మయ్య, శేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, జహీర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య సంతాపం తెలిపారు.

## యేసుక్రీస్తు జీవితం ఆదర్శం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



**జడ్చర్ల టౌన్:** యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంబీ బేథని, ఎంబీ సెంటినరి చర్చిల్లో జరిగిన క్రీస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎంబీ సెంటినరి చర్చిలో ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకృష్ణగౌడ్



**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాచర్ల రామకృష్ణగౌడ్, కార్యవర్గ సభ్యుడిగా జక్క శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఆసంఘం కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు వీరిని ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో కట్టబెట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని రామకృష్ణగౌడ్ తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు వరప్రసద్, శ్రీనుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

**పాలమూరు:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణ 47వ వార్డు బూత్ కమిటీ ఎన్నికలో భాగంగా నూతన బూత్ కమిటీ అధ్యక్షుడితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందించారు. రాబోయే స్థానిక ఎన్నికల వరకు పార్టీని పూర్తిగా బలోపేతం చేయాలని సూచించారు. బీజేపీ అధిక స్థానాలు గెలుపొందాలంటే కార్యకర్తలు మరింత కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ శక్తికేంద్ర ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు నారాయణ, బోయ శ్రీను, రాజు పాల్గొన్నారు.

**బీజేపీ బూత్ కమిటీల ఎంపిక**

**దేవరకద్ర:** మండలంలోని గూరకొండ గ్రామంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి, మండల కమిటీ అధ్యక్షులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని 136, 137బూత్‌లకు కమిటీలను ఎన్నుకొని నియామకపత్రాలను అందజేశారు. బూత్ కమిటీల అధ్యక్షులు చెన్నప్ప, వెంకటేశ్, బీజేపీ నాయకులు గోవిందు, శ్రీనివాసులు, భగవంతు, కొండారెడ్డి, దాసు, ఆశప్ప, ఊసేనప్ప పాల్గొన్నారు.



## ‘ఇందిరమ్మ’లో ఎరుకలకు ప్రాధాన్యమివ్వాలి

**మహబూబ్‌నగర్ రూరల్:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎరుకల కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ ఎరుకల సంఘం గౌరవాధ్యక్షుడు జములయ్య డిమాండ్ చేశారు. స్థానిక జ్యోతిరావు పూలె కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇళ్లు లేని ప్రతి ఎరుకల కుటుంబానికి ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈనెల 29న జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న ఎరుకల కులస్తులు నూతన కార్యవర్గ ఎన్నికకు హాజరు కావాలని కోరారు.నాయకులు శ్రీనివాసులు, రాములు, వెంకటేష్, అంజన్న, శేఖర్, పవన్‌కుమార్, శ్రీనివాసులు, రాజు, బాలరాజు, మహేష్, దశరథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జములయ్య

## రేపు మాదిగ సంఘాల రాష్ట్రస్థాయి సమావేశం

**మహబూబ్‌నగర్ రూరల్:** జిల్లా కేంద్రంలో ఈనెల 24వ తేదీ (మంగళవారం) మాదిగ సంఘాల రాష్ట్రస్థాయి 2వ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాదిగల సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యులు వెంకటస్వామి, నర్సింహులు, బాలరాజు తెలిపారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యుడు బాలరాజు

## వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



మున్సిపల్ కార్యాలయంలో..

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి(కాకా) ప్రజలకు చేసిన సేవలు ఎవరూ మరిచిపోలేరని ఆర్డీఓ నవీన్ అన్నారు. కాకా వర్ధంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, డీపీఆర్ఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ కృష్ణ, కలెక్టరేట్ ఏఓ శంకర్, డీటీ దేవేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**డీఐజీ కార్యాలయంలో**

**మహబూబ్‌నగర్ క్రైం:** జోగులాంబ జోన్–7 డీఐజీ కార్యాలయంలో జి.వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ రాములు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఆర్ఐ నగేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ రూరల్:** మాల మహానాడు ఆధ్వర్యంలో పీవీ రావు, వెంకటస్వామి(కాకా) వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో పీవీ రావు, వెంకట్‌స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, శ్రీనివాసులు, యాదయ్య, కావల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశ్వర రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి

- విద్యార్థులకు అభినందనలు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** రాష్ట్రస్థాయి సీఎం కప్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి సీఎం కప్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాస్థాయిలో 32కేజీ కేటగిరిలో ఎ.వరుణ్, 42కేజీలో విశాల్, 52కేజీలో విఘ్నేష్, 32కేజీలో తనూజ, 37కేజీలో అద్విత, 42కేజీలో త్రిపుర యాదవ్, 46కేజీలో ఆదిభసన ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌కుమార్, రిటైర్డ్ హెచ్ఎం వెంకట కృష్ణయ్య, సలహాదారుడు ఎంఎస్.విజయ్‌కుమార్, సీనియర్ కిక్‌బాక్సింగ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, తదితరులు

## పట్టుదల ఉంటే గణితంలో రాణించొచ్చు

**జడ్చర్ల టౌన్:** కృషి, పట్టుదల ఉంటే రామానుజన్ మాదిరిగా గణితంలో రాణించొచ్చు అని సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితంలో ఆయన సాధించిన ఘనతను గుర్తుకు చేసుకున్నారు.

## రజకుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** రజకుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 29వ తేదీన జనగాం జిల్లాలో నిర్వహించనున్న తెలంగాణ జరక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. 29న రజక సమితి రాష్ట్ర మూడవ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ సలహాదారుడు భరత్‌కుమార్, గౌరవాధ్యక్షుడు కేతూరి శివన్న, అధ్యక్షుడు నాగన్న, జిల్లా అధ్యక్షుడు రాజు, పట్టణ గౌరవాధ్యక్షుడు కుమార్, అధ్యక్షుడు బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, సాయికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** క్రిస్టియన్‌పల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహం మైదానంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిచ్చిమొక్కలు తొలగించి, మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమాల్లో వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, వైస్‌చైర్మన్ డి.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, రాజు, అజ్మత్‌అలీ, ఫయాజ్, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

■ మగువ స్వశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు అంబేద్కర్ కళాభవన్‌లో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సంస్థ ప్రతినిధులు సంధ్య, సింధు, శిరీష, కిరణ్మయి పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

■ విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 17మందికి ఎమినెంట్ టీచర్స్ అవార్డులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రదానం చేశారు. ఆ వేదిక ప్రతినిధులు సత్యనారాయణ, హేమచంద్రుడు, డా.బైకాని బాలుయాదవ్, నరేంద్ర భోగం, ప్రొ.జయలక్ష్మి, వై.రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

**జీతాల కోసం వినతి**

**మహబూబ్‌నగర్ రూరల్:** జిల్లాలోని ఆరు ఎస్సీ కళాశాల వసతిగృహాల్లో వర్కర్లు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి జీతాలు ఇప్పించాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అక్కడే ఉన్న హాస్టల్ వర్కర్స్ ఏజెన్సీ నిర్వాహకుడు వెంకటయ్యను వర్కర్లకు వెంటనే ఒక నెల జీతం ఇవ్వాలని ఆదేశించారు. మల్లెల మాణిక్యం, రాజు, కుర్మయ్య, మనోహర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

### 27న ఆభరణాల ఊరేగింపు

**జడ్చర్ల టౌన్:** పట్టణంలోని ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ ఆభరణాల ఊరేగింపు, మహా పడిపూజను ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రంజిత్‌బాబు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆభరణాల ఊరేగింపు లక్కీ విన్నర్‌గా అనుపరఘును ఎంపికచేశారు. 27వ తేదీ శుక్రవారం సుప్రభాతం, స్వామి అభిషేకం, 7గంటలకు ఆభరణాల పూజ, ఊరేగింపు, 12గంటలకు ఆభరణాల అలంకరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాత్రి 7గంటలకు మహా పడిపూజ నిర్వహిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

### పాలకవర్గం నిర్ణయానికి తాత్కాలికంగా బ్రేక్

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్‌గా 13, 24, 26 వార్డుల్లో చెత్త సేకరణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలనే పాలకవర్గం నిర్ణయానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఒక్కో ఇంటికి రూ.50రుసుము వసూలు చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. సామాజిక మాధ్యమాల్లో ఈనిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి ఈవిషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో చెత్తసేకరణ ప్రైవేట్ వ్యక్తుల ద్వారా జరుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ అందరి సలహాలు స్వీకరించి నిర్ణయం తీసుకుందామని సలహా ఇచ్చారు. దీంతో పాలకవర్గ సభ్యులు సైతం చెత్తసేకరణ అంశంపై అందరి సలహాలు, సూచనలు స్వీకరించాకే అమలు చేద్దామని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు.

### స్థల వివాదంలో ఘర్షణ

- ఇద్దరికి తీవ్రగాయాలు

**మిడ్జిల్:** ఓ స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. మండలంలోని బోయిన్‌పల్లిలో సంతోష్, కమలమ్మ కుటుంబాల మధ్య చాలారోజుల నుంచి ప్లాట్ విషయంలో పంచాయితీ నడుస్తుంది. ఆదివారం సంతోష్ ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టాడు. కమలమ్మ, ఆమె కుమారులు శివ, మల్లేష్ పనులను అడ్డుకున్నారు. దీంతో సంతోష్ గడ్డపారతో కమలమ్మ, శివపై దాడి చేశాడు. వారిద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్సనిమిత్తం ఆస్పత్రి తరలించారు. బాధితురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు సంతోష్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రికార్డులో భాగస్వామ్యం కావడంపై హర్షం

**జడ్చర్ల టౌన్:** హ బిల్డ్–వరల్డ్ రికార్డు యూనియన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ రికార్డు మెడిటేషన్ ఈవెంట్ కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఒకేసారి 2లక్షల87వేల711మంది ధ్యానంలో పాల్గొనటం రికార్డుగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తమ విద్యార్థులు భాగస్వామ్యం అయినందుకు సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. యోగా ఉపాధ్యాయుడు తాహెర్, పీడీ రవికుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. యోగా టీచర్ తాహెర్, పీడీ రవికుమార్‌కు వ్యక్తిగత సర్టిఫికెట్లు కూడా అందాయి.

### విద్యార్థినికి అభినందనలు



**మహబూబ్‌నగర్ క్రీడలు:** జిల్లాస్థాయి సీఎం కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని మహిమాన్వితను ఆదివారం డైట్ కళాశాల ఆవరణలో జీకే షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో పతకం సాధించాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు రవిబాబు, కరాటే విద్యార్థులు దామోదర్, పర్ష పవార్, పవన్, అఖిల్, రిష్విత్ పాల్గొన్నారు.

**బెల్టు గ్రేడింగ్ పరీక్షలు**

కళాశాల ఆవరణలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు మాస్టర్ శివకుమార్ తెలిపారు. ఈ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ కనబరచగా 12 మంది వైట్ బెల్టు, ఎల్లో 5, బ్లూ 4, మెరూన్ 5 బెల్టులు సాధించారు.

### విద్యార్థినుల ప్రతిభ

**మహబూబ్‌నగర్ క్రీడలు:** జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల–3 రెసిడెన్షియల్ విద్యార్థినులు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేఖ, పీఈటీ తైలం చైతన్య తెలిపారు. చెస్‌లో సాదియజబీన్, యోగాలో రూపలత, కబడ్డీలో తేజస్విని, నెట్‌బాల్‌లో ఆయేషాబాను, మంజశ్రీ, అత్యపత్యాలో ఆయేషాబాను, తారక, మాధవి, రెజ్లింగ్‌లో సపురా బంగారు పతకాలు సాధించారు. నెట్‌బాల్‌లో రేష్మ, తస్లీం అంజుమ్, కరాటేలో మావియ రజత పతకాలు పొందినట్లు తెలిపారు.

### సంతలో ఉచిత భోజనాలు



**నవాబుపేట:** మండలంలో ఆదివారం సంతకు వచ్చే జనాలకు ఉచిత భోజనాలను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఏర్పాటుచేశారు. నాలుగు నెలలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు దాదాపుగా 8వేల మందికి పైగా ఉచిత భోజనం స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, వ్యాపార సంఘం నాయకుడు ప్రొద్దుటూరి ఆంజనేయులు, రఘు, చందు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా సర్వే

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్, బీసీ కాలనీ ప్రాంతాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. లబ్ధిదారులకు సంబంధించి వివరాలు సేకరించడంతో పాటు వారి ఫొటోలను అధికారులు తీసుకున్నారు.

### రవీందర్‌నాయక్‌కు గురు స్పందన పురస్కారం



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాలలో ఆదివారం గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్‌కు గురు స్పందన పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శమీల్‌రెడ్డి, డీఐఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.